విప్ ధిక్కరించిన కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలి

- వేసవిలో హరితహారం మొక్కలను సంరక్షించాలి
- పట్టణంలో పారిశుధ్యం నిర్వహణ సరిగా లేదు
- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- వివిధ అంశాలపై కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు వినతి

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల, ఏప్రిల్ 4: పార్టీ విప్ ధిక్కరించి, ఇతరులకు ఓటేసిన బీఆర్ఎస్ కౌన్సిలర్లపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కలెక్టర్‌కు వినతి చేశారు. గురువారం పలు అంశాలపై కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. గత ఫిబ్రవరి 28న జగిత్యాల మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహించగా, తొమ్మిది మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు పార్టీ సూచించిన అభ్యర్థికి బదులు ఇతరులకు ఓటు వేసి, విప్‌ను ధిక్కరించారని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు, రిటర్నింగ్ అధికారి (జడ్పీ సీఈవో)కి అదే రోజు ఫిర్యాదు చేశామన్నారు. కానీ, ఇప్పటివరకు విప్ ధిక్కరించిన కౌన్సిలర్లపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కావున వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే హరితహారంలో భాగంగా జగిత్యాలలో రోడ్డుకు ఇరువైపులా, పార్కుల్లో, ఇతర ప్రాంతాల్లో నాటిన మొక్కలు నీరు లేక ఎండిపోతున్నాయని, వాటికి నీటి వసతి కల్పించి, మొక్కలను రక్షించాలని అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జగిత్యాలలోని మార్కెట్లు, టవర్ వద్దగల పాత మార్కెట్, రైతు బజార్, పట్టణంలోని ఇతర ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతుందని, వెంటనే ప్రత్యేక శ్రద్ధ వహించి పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. మున్సిపల్ పరిధిలోని వాణిజ్య దుకాణ సముదాయంలో గల షాపులను కొందరు ఆక్రమించి, అద్దె చెల్లించకుండా ఇతరులకు కిరాయికి ఇస్తున్నారని వినతిలో పేర్కొన్నారు. ఈ విషయమై వెంటనే విచారణ చేపట్టి ఆక్రమణదారులను తొలగించి, వారి నుంచి అద్దె వసూలు చేసి మున్సిపల్ అభివృద్ధికి చొరవ చూపాలన్నారు. జగిత్యాల చలిగల్ మ్యాంగో మార్కెట్‌కు ఈ సీజన్‌లో భారీ స్థాయిలో మామిడి పంట వచ్చే అవకాశం ఉందన్నారు. దీంతో మామిడి పండ్ల కొనుగోలుదారులకు, అమ్మకందారులకు మౌలిక వసతులు కల్పించేలా సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేసేలా చొరవ చూపాలని వినతిపత్రంలో కోరారు.

పది ఇసుక ట్రాక్టర్లు సీజ్

వెల్గటూర్/మల్లాపూర్, ఏప్రిల్ 4: ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో గురువారం ఉదయం పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా పెద్దపల్లి జిల్లా నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు. మల్లాపూర్ మండలం సాతారం గ్రామ శివారులో అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు.

రేషన్‌షాపుపై కేసు నమోదు

మల్లాపూర్, ఏప్రిల్ 4: మండలకేంద్రంలోని గ్రామానికి చెందిన లలిత రేషన్ దుకాణ డీలర్‌పై 6-ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ వీర్‌సింగ్ గురువారం తెలిపారు. సదరు దుకాణాన్ని తనిఖీ చేయగా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా 1.45 క్వింటాళ్ల రేషన్ బియ్యం వ్యత్యాసాన్ని గుర్తించినట్లు తెలిపారు. దీంతో సంబంధిత రేషన్‌దుకాణం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇక్కడ ఆర్ఐ సురేశ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ

కోరుట్ల, ఏప్రిల్ 4: పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ దవాఖాన సమీపంలో ఉచితంగా 150 మందికి అల్పాహారం పంపిణీ చేశారు. భవిష్యత్‌లో దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం అందించేందుకు చర్యలు తీసుకుంటామని క్లబ్ అధ్యక్షుడు వనపర్తి చంద్రమోహన్ తెలిపారు.

ఇంటర్నేషనల్ రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీలో బంగారు పతకం సాధించిన విద్యార్థులు

జాతీయ స్థాయిలో బంగారు పతకం

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 4: నేపాల్‌లోని పోకార పట్టణం రంగసాలా స్టేడియంలో ఇటీవల నిర్వహించిన థర్డ్ సౌత్ ఏసియా ఇంటర్నేషనల్ రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ జూనియర్ అండర్-16 టోర్నీలో జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థులు బంగారు పతకం సాధించారు. జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌లో గల చైతన్య టెక్నో పాఠశాలలో 8, 9వ తరగతికి చెందిన సాయివరుణ్, సహర్స్, హిమెక్షన్, అయాన్ పాషా, కీర్తి వర్ధన్, హర్షిత్, పృథ్వీ, మోక్షిత్, రోహిత్, విజితేంద్ర, ప్రణవ్, ఇండియా తరపున ఆడి బంగారు పతకం సాధించారు. కోచ్ వంశీకిషోర్, పీఈటీ రాజు, అకాడమిక్ కోఆర్డినేటర్ శివ కోటేశ్వర్‌రావు, అజయ్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ సచిన్, పలువురు అభినందించారు.

క్విజ్ పోటీల్లో ఊట్‌పల్లి విద్యార్థుల ప్రతిభ

క్విజ్ పోటీలో విజేతగా నిలిచిన ఊట్‌పల్లి విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అధికారులు

కథలాపూర్, ఏప్రిల్ 4: భూషణరావుపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ స్థాయి క్విజ్ పోటీల్లో ఊట్‌పల్లి విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. పోసానిపేట విద్యార్థులు ద్వితీయ బహుమతి, దుంపేట విద్యార్థులు తృతీయ బహుమతి సాధించారు. విజేతలైన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి రాజేశ్, ఎంఈవో ఆనందరావు, కాంప్లెక్స్ హెచ్ఎం అర్జున్, హెచ్ఎంలు రాజయ్య, విష్ణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ వారియర్స్‌కు మొబైల్ ఫోన్లను అందిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సైబర్ నేరాల పరిష్కారానికి వారియర్స్

- ప్రతీ పోలీస్‌స్టేషన్‌కో సైబర్ వారియర్
- ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

జగిత్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 4: సైబర్ నేరాల నియంత్రణ, సైబర్ బాధితులకు మెరుగైన సేవలందించేందుకు ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్‌ను ఏర్పాటు చేశామని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలో సైబర్ వారియర్స్‌కు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ గురువారం మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరాల నియంత్రణకు జిల్లాలోని 18 పోలీస్ స్టేషన్లలో 18 మంది సైబర్ వారియర్లను నియమించామన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు ఆందోళన చెందకుండా తక్షణమే 1930కు లేదా ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. దీంతో వెంటనే నిందితులను గుర్తించి, పోగొట్టుకున్న డబ్బును రికవరీ చేయడం సులభతరమవుతుందన్నారు. నెట్‌వర్క్ రద్దీ వల్ల 1930ను సంప్రదించడంలో కాస్త జాప్యం జరుగుతుండడంతో ప్రతి పోలీస్ స్టేషన్‌కు సైబర్ వారియర్‌ను అందుబాటులో ఉంచామన్నారు. ప్రత్యేక ఫోన్ నంబరును సైతం కేటాయించామని తెలిపారు. బాధితులు సైబర్ వారియర్స్‌ను సంప్రదిస్తే తగిన సేవలందిస్తారన్నారు. బాధితులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్స్ డీఎస్పీ రంగారెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ వారియర్స్ ఫోన్ నంబర్లు

ధర్మపురి-8712657782, ఇబ్రహీంపట్నం-8712657783, జగిత్యాల టౌన్-8712657784, కొడిమ్యాల-8712657785, కోరుట్ల-8712657786, మెట్‌పెల్లి-8712657787, మల్లాపూర్-8712657788, రాయికల్-8712657790, గొల్లపల్లి-8712657791, సారంగాపూర్-8712657792, కథలాపూర్-8712657793, మల్యాల-8712657794, పెగడపెల్లి-8712657795, వెల్గటూర్-8712657796, బీర్‌పూర్-8712657797, బుగ్గారం-8712657798, మేడిపెల్లి-8712657799, జగిత్యాల రూరల్-8712657800.

అప్పుడేమో మొసలి కన్నీరు.. ఇప్పుడేమో రైతులకు అన్యాయం

- బీడీ కార్మికులకు రూ. 4వేల పెన్షన్ హామీ ఏమైంది
- 40 ఏళ్ల రాజకీయ జీవితంలో జగిత్యాలకు ఏం చేశారు..?
- నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డిని నిలదీసిన బీజేపీ నాయకురాలు భోగ శ్రావణి

మాట్లాడుతున్న శ్రావణి

జగిత్యాల, ఏప్రిల్ 4: బీఆర్ఎస్ హయాంలో మొసలి కన్నీరు కార్చిన కాంగ్రెస్, ఇప్పుడు రైతులకు అన్యాయం చేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి విమర్శించారు. 'కాంగ్రెస్ హయాంలో చెరుకు, పసుపు, మామిడి రైతులు నష్టపోయారు.. రైతులను మభ్యపెట్టి మోసం చేయకండి.. పసుపు రైతు కండ్లలో ఆనందం ఉంటే, మీ కండ్లల్లో ఎందుకు నిప్పులు చెరుగుతున్నారు' అని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని ఆమె నిలదీశారు. గురువారం జగిత్యాలలో బీజేపీ నాయకులతో కలిసి శ్రావణి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మీ ఇంటి ఎదుట రోడ్డు వేయించుకున్నారు కానీ, జగిత్యాల పట్టణ ప్రధాన యావర్ రోడ్డు సంగతి మర్చిపోయారని గుర్తు చేశారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో జగిత్యాలకు ఏం చేశారని జీవన్‌రెడ్డిని నిలదీశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కాస్త నోరు అదుపులో పెట్టుకోవాలని, చదువుకున్న మేధావులైన తమరు అదుపు తప్పితే, తాము కూడా నోరు తెరవాల్సి ఉంటుందని హెచ్చరించారు. బీడీ కార్మికులకు వంద రోజుల్లో రూ.4వేల పెన్షన్ హామీ ఏమైందని ప్రశ్నించారు.

ఎమ్మెల్యే సంజయ్‌కు పరామర్శ

ఎమ్మెల్యే సంజయ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేశ్ బాబు

జగిత్యాల, ఏప్రిల్ 4: జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, తండ్రి హన్మంతరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, ఆయన కుటుంబసభ్యులను ఎమ్మెల్యే నివాసం హౌసింగ్ బోర్డులో వేములవాడ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెన్నమనేని రమేశ్‌బాబు కలిసి పరామర్శించారు. పరామర్శించిన వారిలో జడ్పీ చైర్‌పర్సన్ దావా వసంత- సురేశ్ దంపతులు, జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, కథలాపూర్ జడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు ఉన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

డీలర్‌తో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వాణి

కొడిమ్యాల, ఏప్రిల్ 4: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని జిల్లా వ్యవసాయాధికారి వాణి సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఇన్‌పుట్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎరువులు, విత్తనాల నిల్వలను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ధరల పట్టికను బోర్డుపై ప్రదర్శించాలన్నారు. అనంతరం రామకిష్టాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యంలో తాలు లేకుండా తీసుకురావాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పర్లపల్లి జ్యోతి, ఏఈవో మంజుల, రైతులు తదితరులున్నారు.

ఆస్తి పన్నుపై రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి, ఏప్రిల్ 4: మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఇంటి పన్ను చెల్లింపుదారులు ప్రభుత్వం కల్పించిన ఐదు శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ సూచించారు. ఈ నెలాఖరు వరకు ఆస్తి పన్ను చెల్లింపుపై ప్రభుత్వం రాయితీని కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని ఇంటి పన్ను చెల్లింపుదారులు వినియోగించుకుని మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం


శ్రీనివాసరావును సత్కరిస్తున్న నాయకులు

కోరుట్ల, ఏప్రిల్ 4: బార్ అసోసియేషన్ పట్టణాధ్యక్షుడిగా ఎన్నికైన తన్నీరు శ్రీనివాసరావును గురువారం బీఆర్ అంబేద్కర్ కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పూల మొక్కను అందించి అభినందనలు తెలిపారు. ఇక్కడ నాయకులు కృష్ణప్రసాద్, నర్సయ్య, సురేశ్, గంగాధర్, శేఖర్ తదితరులున్నారు.

మోడల్ స్కూళ్ల అర్హత పరీక్షకు ఏర్పాట్లు చేయాలి

జగిత్యాల, ఏప్రిల్ 4: మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి, మిగిలిపోయిన ఏడు నుంచి పదో తరగతుల్లో అడ్మిషన్లు పొందడానికి ఈనెల 7న నిర్వహించనున్న అర్హత పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖ అధికారులను, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆదేశించారు. ఆరో తరగతిలో చేరడానికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఏడు నుంచి పదో తరగతి వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అర్హత పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష సమయంలో విద్యుత్‌లో అంతరాయం లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షలు నిర్వహించే ప్రాంతాల్లో144 సెక్షన్ విధించాలని సంబంధిత తహసీల్దార్లకు కలెక్టర్ సూచించారు.

నేడు అధికారికంగా బాబూ జగ్జీవన్ రామ్ జయంతి

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 4: బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని శుక్రవారం అధికారికంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పసుపు @ రూ.15,019

మెట్‌పల్లి, ఏప్రిల్ 4: పసుపు ధరలు స్వల్పంగా పెరిగాయి. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం 944 క్వింటాళ్ల పసుపు కొనుగోలు జరిగింది. పసుపు కాడి రకానికి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.15,0 19, కనిష్ఠంగా రూ.5 వేలు, గోళకు గరిష్ఠంగా రూ.13,395, కనిష్ఠంగా రూ.4,2 00, పసుపు చూరకు రూ.15,333, కనిష్ఠంగా రూ.5 వేలు ధర పలికింది. ఇప్పటి వరకు మార్కెట్‌లో 25,978 క్వింటాళ్ల పసుపు కొనుగోలు జరిగినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్ర సేనారెడ్డి తెలిపారు.

కో ఆర్డినేటర్‌గా ప్రకాశ్

మెట్‌పల్లి, ఏప్రిల్ 4: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్‌గా పెద్దెల్లి ప్రకాశ్‌ను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. టీపీసీసీ కార్యదర్శిగా ఉన్న ప్రకాశ్‌ను కోరుట్ల నియోజకవర్గం కో ఆర్డినేటర్‌గా నియమించడంపై బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవం

వార్షికోత్సవం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 4: యూసుఫ్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు చిన్నారుల అభివృద్ధి నివేదికలు తల్లిదండ్రులకు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పైనీమార్సు, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, సుజాత, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల భత్యాల్లో ఏకరూపత పాటించాలి

కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందిస్తున్న తపస్ నాయకులు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 4: లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వర్తించడానికి అత్యవసరాలు ఉన్న ఉపాధ్యాయులను, సిబ్బందిని మినహాయించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ కోరింది. ఈ మేరకు గురువారం కలెక్టర్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి హన్మంతరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఒక్కో రీతిగా ఎన్నికల భత్యం పంపిణీ చేశారని, అతి తక్కువగా కోరుట్ల నియోజకవర్గంలో చెల్లించారన్నారన్నారు. ఇప్పటి వరకు మిగిలిన భత్యాన్ని కూడా చెల్లించలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో, జిల్లాలో ఒకే రకమైన ఎన్నికల భత్యాన్ని చెల్లించాలన్నారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు నరేందర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవయ్య, ప్రసాదరావు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

కొడిమ్యాల, ఏప్రిల్ 4: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని, రైతు పెట్టుబడి సాయం, వరి పంటకు రూ.500 బోనస్ అమలు చేయాలని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే వస్త్ర పరిశ్రమ సంక్షోభం

- తెలంగాణ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్4 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని తెలంగాణ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ మండిపడ్డారు. ఈ నెల 6న నిర్వహించ తలపెట్టిన నేతన్న గర్జన సభను విజయవంతం చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్లలో పెద్దఎత్తున పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ, బతుకమ్మ చీరల ఆర్డర్లు, పెండింగ్ బకాయిలు ₹290 కోట్లు ఇవ్వకుండా ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. నేతన్నలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో మూడు నెలలుగా ఉపాధి కోల్పోయి వందలాది మంది నేత కార్మికులు రోడ్డునపడి అన్నమో రామచంద్రా అంటూ.. ఆర్థిస్తున్నా ప్రభుత్వానికి కనికరంలేకుండా పోయిందని మండిపడ్డారు. కార్మికుల జీవితాలతో ప్రభు త్వం చెలగాటం ఆడుతున్నదని ధ్వజమెత్తారు. నేతన్నలకు 360రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నేతన్నల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలన్ని కొనసాగించాలని కోరారు. ఈ నెల 6న సిరిసిల్ల ప్రభుత్వజూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే నేతన్న గర్జన సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అధికారుల నుంచి మొదలుకుని ముఖ్యమంత్రి వరకు సమస్య తీవ్రతపై వినతిపత్రాలు అందజేశామని వెల్లడించారు. అయినా సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం ఏ మాత్రం చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా నేతన్న గర్జన సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పాదయాత్రను ఉద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్

నవోదయకు ఎంపికైన విద్యార్థినికి సన్మానం

విద్యార్థినిని అభినందిస్తున్న మ్యాస్ట్రో యాజమాన్యం

కథలాపూర్, ఏప్రిల్ 4: మండలకేంద్రానికి చెందిన ఐదో తరగతి విద్యార్థిని రిక్కల హనిష జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో సీటు సాధించినట్లు మ్యాస్ట్రో స్కూల్ కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని శాలువాతో సన్మానించి అభినందించారు.

'బీడీ కార్మికులకు న్యాయం చేయాలి'

జగిత్యాల, ఏప్రిల్ 4: బీడీ కార్మికుల సమస్యలపై పూర్తి అధ్యయనం చేసి, వారికి న్యాయం జరిగే విధంగా హామీలు ఇస్తేనే భారత కమ్యూనిస్ట్ జిల్లా సమితి పూర్తి మద్దతు తమకు ఉంటుందని సీపీఐ నాయకుడు వెన్న సురేశ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బీడీ కార్మికుల, టేకేదారు యూనియన్ సమావేశంలో మాట్లాడిన విషయాలు అస్పష్టంగా ఉన్నాయని వాపోయారు. బీడీ యాజమాన్యం వద్ద కమీషన్ ఏజెంట్లుగా పనిచేస్తున్న, అమ్ముడుపోయిన బీడీ కార్మిక నాయకులు వాస్తవ విషయాలను తమ దృష్టికి తీసుకురాలేదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కనీస వేతన జీవోను పొడిగిస్తే బీడీ కార్మికులకు కనీసం వెయ్యి బీడీలకు దాదాపు రూ.330 వస్తాయని, జీవో పొడిగింపు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుందన్నారు. జీవో పొడిగింపునకు సహకరించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కోరారు.

చదువుకుని గొప్పోడయితడనుకుంటే..

- చెరువులో మునిగి బాలుడి మృతి
- అల్మాస్‌పూర్‌లో ఘటన

గొల్లెం హరికృష్ణ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4: చదువుకుని గొప్పోడయితడని ఎన్నో కలలు కని కష్టపడి చదివించిన కొడుకు చెరువులో మునిగి విగతజీవిగా మారడం తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది. ఎస్ఐ రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. వీర్నపల్లి మండలం కంచర్లకు చెందిన గొల్లెం లక్ష్మి-వెంకటి దంపతుల చిన్న కొడుకు హరికృష్ణ(14) ఇటీవలే పదోతరగతి పరీక్షలు రాశాడు. అయితే పై చదువుల కోసం గురువారం వీర్నపల్లి మండల కేంద్రంలో పలు ధ్రువీకరణ పత్రాలకోసం దరఖాస్తు కూడా చేసుకొని ఇంటికి తిరిగివచ్చాడు. తన బంధువు కొమిరె రాకేశ్ అనే బాలుడితో కలిసి అల్మాస్‌పూర్ శివారులోని రంగం చెరువును ఆనుకుని ఉన్న తమ పొలం వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో హరికృష్ణ పొలానికి నీళ్లు పెట్టేందుకు మోటర్ ఆన్‌చేశాడు. అనంతరం హరికృష్ణ ఈతకొట్టేందుకు చెరువులో దిగాడు. గతంలో చెరువులో గుంతలు తీయడం, లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగాడు. ఎంతకీ బయటికి రాకపోవడంతో కంగారుపడ్డ రాకేశ్ విషయాన్ని చుట్టుపక్కలవారికి చెప్పాడు. బంధువులు, స్థానికులు వచ్చి చెరువులో గాలించగా, హరికృష్ణ అప్పటికే మృతిచెందాడు. మృతదేహం లభ్యం కావడంతో తల్లి లక్ష్మి గుండెలవిసేలా రోదించింది. చెరువు పక్కనే పట్టా భూమి యజమాని చిదుగు గోవర్ధన్‌గౌడ్ చెరువులో గుంతలు తీయడం వల్లే తన కొడుకు మృతి చెందాడని బాలుడి తల్లి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, బాలుడి తండ్రి వెంకటి మూడు నెలల క్రితం, సోదరుడు ఆరు నెలల క్రితం బతుకుదెరువు కోసం దుబాయ్ వలసవెళ్లారు.

వృద్ధురాలి మెడలో నుంచి బంగారం చోరీ

కథలాపూర్, ఏప్రిల్ 4: మంచంలో పడుకున్న వృద్ధురాలి మెడలో నుంచి దొంగలు బంగారాన్ని ఎత్తుకెళ్లిన ఘటన కథలాపూర్ మండలం రాజారాం తండాలో జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం... బుధవారం రాత్రి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి కోళ్లను కొనుగోలు చేసేందుకు వచ్చినట్లు స్థానికులతో ముచ్చటించారు. కాగా, వృద్ధురాలు అపావత్ బిక్కి తన ఇంటి ఎదుట మంచంలో పడు